క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



బొల్లవరం(ముప్పాళ్ళ): బొల్లవరం అడ్డరోడ్డులో హోంగార్డు సుభాని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం సత్తెనపల్లి రూరల్ సీఐ ఉమేష్ ప్రారంభించారు. విధులు నిర్వర్తిస్తూ.. 20ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తూ, ప్రజల దాహార్తిని తీరుస్తున్న సుభానీని ఆయన అభినందించారు. ఏఎస్సై ఇమామ్, రైటర్ మాధవరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు శిరిగిరి అర్జునరావు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ సోమవారం ప్రారంభించారు. వేసవి ఎండలు పెరుగుతున్న దృష్ట్యా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు, ప్రయాణీకులు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్ఐలు ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు, కపిల్ దేవ్, సీనియర్ అసిస్టెంట్ హైమరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



సత్తెనపల్లి: పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం రోడ్డులో ఇటీవల ప్రారంభించిన శరవణ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నరాల వైద్యులు శెట్టిపల్లి శరవణ ప్రమోద్ రోగులకు బీపీ, షుగర్, బీఎంఐ తదితర పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు.

బీజేపీని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుదాం

అచ్చంపేట: మతోన్మాద బీజేపీని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుదాం అనే నినాదంతో సీపీఐ నాయకులు సోమవారం అచ్చంపేటలో కర పత్రాలు పంపిణీ చేశారు. ప్రచార భేరి పోస్టర్స్‌ని ఆవిష్కరించారు. నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు పున్నా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. సీపీఐ నాయకులు సంపంగుల ఏడుకొండలు, ఏఐటీయూసీ నాయకులు ప్రసాదు, నరసింహారావు, ఈశ్వరరావు, నాగేశ్వరరావు, జయన్న తదితరలు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

సత్తెనపల్లి: దాతృత్వానికి ప్రతీక రంజాన్ మాసమని 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 20వ వార్డుకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూకుట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 11వ సచివాలయంలో సోమవారం ముస్లిం మహిళలు, సిబ్బందికి రంజాన్ తోఫా, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద వర్గాలకు ప్రతి ఒక్కరూ ఏదో రూపంలో చేయూతనందించాల్సిన అవసరం ఉందన్నారు. కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, పార్టీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు తుమ్మల వెంకటేశ్వరరావు, 30వ వార్డు ఇన్‌చార్జ్ ఉల్లంగుల ప్రసాదు, ట్రేడ్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు వల్లెం నరసింహారావు, నాయకులు దాసరి తిరుపతిరావు, అంగులూరి సుబ్బారావు పాల్గొన్నారు.

రేపు మహంకాళీ అమ్మవారి తిరునాళ్ల

మాదల(ముప్పాళ్ళ): భక్తుల పాలిట కొంగు బంగారం మాదల శ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయ 43వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 19న జరగనుంది. ఏటా శ్రీరామ నవమి తర్వాత తిరునాళ్ల నిర్వహించటం ఆనవాయితీ. ఆలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. వేసవి దృష్ట్యా ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. దర్శనం కోసం వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. భారీ విద్యుత్ ప్రభలను గ్రామస్థులు సిద్ధం చేస్తున్నారు. సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నరసరావుపేట ప్రాంతాలతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

జగనన్నే మా భవిష్యత్తుతో ఆత్మస్థైర్యం

- మంత్రి అంబటి రాంబాబు
- పీపుల్స్ సర్వే నిర్వహణలో ముందు వరుసలో సత్తెనపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా..నాలుగు సంవత్సరాల పరిపాలన తర్వాత, ఎన్నికలకు ఏడాదికాలం ఉండగా ప్రజాప్రతినిధులను ప్రతి ఇంటికి పంపించి ప్రభుత్వ సేవల పై ఆరా తీయించి, వారి అభిప్రాయాలు తెలుసుకునినే భారీ కార్యక్రమం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే జరుగుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద 'జగనన్నే మా భవిష్యత్ .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమ సమీక్షలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టిన ఈ పరిపాలన తోనే నియోజకవర్గ స్థాయి నాయకులకు ఆత్మస్థైర్యాన్ని కలిగించిందని, అందుకే ప్రశాంతంగా ప్రజల వద్దకు వెళుతున్నామన్నారు. 50 శాతం పైగా ప్రజలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారన్నారు.

ముందు వరుసలో ఉన్న సత్తెనపల్లి...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 'జగనన్నే మా భవిష్యత్ .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమ నిర్వహణలో సత్తెనపల్లి నియోజకవర్గం ముందు వరుసలో ఉందని మంత్రి అంబటి తెలిపారు. ఈ నెల 7 నుంచి మొదలై 20 తేదీ వరకు జరుగుతుందని, అయితే పట్టణంలో కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమష్టి కృషితో 18వ తేదీ కల్లా ముగుస్తుందని, వేగంగా పూర్తిచేసిన నేతలను ఆయన అభినందించారు.

ఈనెల 21న వడ్డెర సత్తెన్న విగ్రహావిష్కరణ...

వడ్డెర సామాజిక వర్గానికి చెందిన సత్తెన్న విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 21వ తేదీన జరగనుందని, ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై విజయ వంతం చేయాలని మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నూతన ఎమ్మెల్సీలు ఏసురత్నం, మర్రి.రాజశేఖర్‌లు, ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సాంబశివరావు అధ్యక్షత వహించారు. వైద్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగ భూషణ్ రెడ్డి మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్, కో ఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మక్కెన అచ్చయ్య, నాయకులు హరి, వెంకటేశ్వర్లు, సతీష్, ఆనంద్, వెంకటరావు, మాధవ్, మల్లికార్జున రెడ్డి, మోషే ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవస్వామి ఆలయ వార్షికోత్సవం



మంత్రి అంబటి రాంబాబుకు స్వాగతం పలుకుతున్న కమిటీ సభ్యులు

సత్తెనపల్లి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ 7వ వార్షికోత్సవాలు సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. వేదమంత్రోచ్చరణలతో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అన్న సంతర్పణను ప్రారంభించిన మంత్రి.. భక్తులకు దగ్గరుండి భోజనం వడ్డించారు. భక్తులు అధిక సంఖ్యల పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, చిలుకా జయపాల్, సత్తెనపల్లి రూరల్ సీఐ రామిశెట్టి ఉమేష్, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, ఎస్ఐ ఆవుల బాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ రవి పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవాలయం వార్షికోత్సవం

సత్తెనపల్లి: ధూళ్ళిపాళ్ల గ్రామంలోని వీరభద్ర స్వామి దేవాలయ ఐదో వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వీరభద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయనకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ఆశీస్సులను మంత్రి పొందారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్ఆర్ సీపీ సత్తెనపల్లి రూరల్ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ధూళ్ళిపాళ్ల ది ఆంధ్ర బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, రాజుపాలెం జెడ్పీటీసీ సునీతారెడ్డి పాల్గొన్నారు.

నిమ్మ చెట్లు దగ్ధం

బెల్లంకొండ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా.. మంటలు వ్యాపించడంతో నిమ్మతోటలోని చెట్లు దగ్ధమైన ఘటన మన్నెసుల్తాన్ పాలెంలో సోమవారం చోటు చేసుకుంది. రైతు బోనం వెంకటరామిరెడ్డి వివరాల మేరకు.. మధ్యాహ్నం పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు చెలరేగాయి. ఈ మంటలు పక్కనే ఉన్న నిమ్మతోట కంచెకు అంటుకున్నాయన్నారు. కంచె పూర్తిగా తగలబడడంతో పాటుగా పొలంలో ఉన్న ఎండుగడ్డికి అంటుకుని నిమ్మతోటలోని దాదాపు 50 చెట్లు దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపారు. చుట్టు పక్కల పొలాల రైతులు గమనించి వెంటనే మంటలను అదుపుచేశారు. దాదాపుగా రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు వెంకట్రామిరెడ్డి వాపోయాడు.

ప్రజానాట్య మండలి కార్యదర్శి వెంకటరామయ్య మృతి

పెదకూరపాడు: గుండెపోటుతో ప్రజా నాట్యమండలి కార్యదర్శి పసుపులేటి వెంటకరామయ్య (70) సోమవారం మృతి చెందారు. ప్రజా నాట్యమండలి కళాకారుడిగా శ్రీకృష్ణరాయభారం, రామాంజనేయ యుద్ధం నాటకాల్లో రాముడు, కృష్ణుడి వేషాలతో మంచి నటుడిగా పేరు తెచ్చుకున్నారు. వెంకటరామయ్య మృతికి ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు మునగోటి శ్రీనివాసరావు నివాళులర్పించారు. నందిగం వెంకటరత్నం, వెంకటేశ్వరరావు, చంద్రమ్మరాజు , ఏడుకొండలు , సత్యమూర్తి, మల్లేశ్వరరావు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సతీమణి



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న నంబూరు వసంతకుమారి

క్రోసూరు: రంజాన్ పండుగ మాత్రమే కాదని, జీవన విధానమని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వంసత కుమారి పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా క్రోసూరు షాదీఖానాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆమె హాజరయ్యారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరూ దైవభీతి, దేవునిపై నమ్మకంతో సాటివారి పట్ల ప్రేమ చూపాలన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నియోజకవర్గంలోని ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్, జెడ్పీటీసీ షేక్ జమీలా, షేక్ గఫూర్, షేక్ ఖాదర్, డాక్టర్ షరీఫ్, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

క్రోసూరు: పదవ తరగతి పరీక్షలు రాసి పాలిటెక్నిక్ కోర్సులలో చేరాలనుకునే విద్యార్థులకు పాలిసెట్ ప్రవేశ పరీక్షకు క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు కాలేజ్ ప్రిన్సిపల్ బీవీ రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రోసూరులోని జెడ్పీ పాఠశాల ఆవరణలో ఉన్న కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత స్టడీ మెటీరియల్ అందిస్తామని, ప్రవేశ పరీక్షకు ఈ నెల 30 నుంచి దరఖాస్తు చేసుకోవాలని, మే 5న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. కోచింగ్ తీసుకునే విద్యార్థులకు ప్రవేశపరీక్ష దరఖాస్తు అప్‌లోడ్ చేయటం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. క్రోసూరు, పరిసర గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

- వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయ వీడీఏ కృపదాసు
- పల్నాడు జిల్లాలోని విత్తన దుకాణదారులు, డిస్ట్రిబ్యూటర్స్‌కు వర్క్‌షాప్



మాట్లాడుతున్న వీడీఏ కృపదాసు, జిల్లా వ్యవసాయాధికారి మురళీ, ఏడీఏ రవికుమార్

సత్తెనపల్లి: రైతులకు పత్తి, మిరప విత్తనాలు నిర్ణీత ధరలకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయ వీడీఏ కృపదాసు సూచించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో పల్నాడు జిల్లా ప్రాంతం లోని వివిధ విత్తన కంపెనీల విత్తన దుకాణదారులు, డిస్ట్రిబ్యూటర్స్‌తో ఖరీఫ్ సీజన్ -2023 గాను ముందస్తుగా విత్తన ప్రణాళిక పై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కృపదాసు మాట్లాడుతూ ఏ కంపెనీకి సంబంధించి అయిన రైతులకు కావాల్సిన పత్తి, మిరప విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించి నిర్ణీత ధర కన్నా అధికంగా అమ్మినట్‌లైతే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీ సీడ్స్ వారు రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. కంపెనీల డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్ కూడా రైతులకు ఏ రకమైన విత్తనాలు అవసరమో, ఆ రకం కొరత లేకుండా మార్కెట్‌లో రైతుకు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ మాట్లాడుతూ గత సంవత్సరం పత్తి, మిరప పంటల్లో వచ్చిన దిగుబడులు ఆధారంగా, రైతుల సుము ఖతను బట్టి ఇప్పటికే ప్రతి మండలం నుంచి రైతులకు ఏ కంపెనీ విత్తనం (ప్రత్తి ,మిరప) ఎంత మొత్తంలో కావాలో ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. అన్ని కంపెనీల వారిని కూడా అదే మొత్తంలో విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరామని, వారు కూడా సరఫరా చేస్తామని తెలియజేశారన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సీహెచ్.రవి కుమార్, ఏపీ సీడ్స్ డీఎం జి.సుబ్బయ్య, పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ ఏఓ ఆర్. సుజాత, సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ఏడీఏ ఎస్.శ్రీధర్ రెడ్డి, పల్నాడు జిల్లా లోని అన్ని వ్యవసాయ శాఖ సబ్ డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు, వివిధ విత్తన కంపెనీల డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్ పాల్గోన్నారు.

ఆశ్రమ ఆస్తులను కాపాడండి

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ఆస్తులను కాపాడాలని, హైందవ ధర్మాన్ని పరిరక్షించాలంటూ విశ్వ బ్రాహ్మణ సంఘాలు పట్టణంలో సోమవారం ప్రదర్శన నిర్వహించాయి. డీఎస్పీ ఆది నారాయణకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. డీఎస్పీని కలిసిన వారిలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందరావు, విశ్వకర్మ ధర్మపీఠం ఉపాధ్యక్షుడు కన్నెగంటి శివరామ ప్రసాద్, వరద మధు భాస్కర్, పల్నాడు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కంచర్ల విష్ణువర్ధనాచారి, ముద్ర రమేష్ బాబు, సొలసి సాంబయ్య, మహిళా సంఘం బాధ్యులు కిల్లంపల్లి ఉమాదేవి, చిరుమామిళ్ల లక్ష్మీనారాయణమ్మ, తమ్మిశెట్టి కమలా దేవి, అమృతా లక్ష్మీ తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాలు దూరం

సత్తెనపల్లి: సరైన జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవని సత్తెనపల్లి ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి అలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని వేద జూనియర్ కళాశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై సోమవారం నిర్వహించిన అవగాహన ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏదో ఒక చోట అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. చిన్న పాటి తప్పిదాలు పెను ముప్పుగా మారే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే 101కు కాల్ చేసి, సమాచారం అందించాలని కోరారు. గృహ సిలిండర్ నుంచి మంటలు వ్యాపించినప్పుడు ఎలా నియంత్రించాలో ప్రత్యక్షంగా డెమో ఇచ్చారు. డ్రైవర్ ఆపరేటర్ డి.వి జయ భాస్కర్ రెడ్డి, ఫైర్ మెన్‌లు ఎం.మోహన్ బాబు, షేక్ సుభాని, ఎస్.రమణ నాయక్ పాల్గొన్నారు.

పెరికపాడులో గ్రామసభ

పెరికపాడు(క్రోసూరు): పెరికపాడు గ్రామ సభ సోమవారం జరిగింది. గ్రామ సర్పంచ్ బయ్యవరం కల్యాణి అధ్యక్షతన వహించారు. ఉపాధి హామీ పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని త్వరగా ఇప్పించాలని కొందరు కోరారు. రక్షిత తాగునీరు ఇంటింటికీ జలజీవన్ మిషన్ పథకం ద్వారా త్వరలో అందించనున్నట్లు కో-ఆర్డినేటర్ జడ సుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అరుణ, సెక్రటరీ వెంకయ్య, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు బయ్యవరం మస్తాన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురై ఆసుపత్రిలో మృతి చెందిన పెద్దింటి భిక్షం (59)కుటుంబానికి జగనన్న బీమా నగదు రూ.5 లక్షల చెక్కును సర్పంచ్ అందజేశారు.

మృతుని కుటుంబానికి నగదు సాయం

సత్తెనపల్లి: పట్టణంలో 24వ వార్డుకు చెందిన అనుమల సుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా పథకంలో భాగంగా తక్షణ సాయం రూ. 10 వేలు మట్టి ఖర్చులు కింద మృతుడి భార్య వనజకు స్థానిక కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ సోమవారం అందించారు. 22వ వార్డు కౌన్సిలర్ శెట్టి ఆనంద్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అవంతిక, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పేదల జీవన స్థాయిని మెరుగుపరిచారని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. సోమవారం లింగాపురం గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన పభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. రేషన్ కార్డు, పింఛన్లు ఇతర సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ వివక్ష లేకుండా అందించాలని ఆదేశించారు. గ్రామంలో సైడ్ కాల్వలు, కొన్ని చోట్ల మంట్టి రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉందని గ్రామస్తులు వివరించగా.. త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే శంకరరావు వారికి హామీ ఇచ్చారు. లింగాపురం గ్రామంలో 350 గడపలను సందర్శించారు. సీఎంగా వైస్ జగన్‌ను, ఎమ్మెల్యేగా తనను మరలా ఆశీర్వదించాలని కోరారు. గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి ద్వారా రూ.16.30కోట్లు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏడుకొండలు, అమరయ్య, శ్రీను, పుట్టి కోటయ్య, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ హరిబాబు, మాజీ ఎంపీపీ వెంపా జ్వాలాలక్ష్మీ నరసింహారావు, మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, మంగిశెట్టి కోటేశ్వరరావు, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అలా లక్ష్మీనారాయణ, నండూరి కరుణకుమార్ నాయుడు రాంబాబు, చిలకా సాంబయ్య, ఎంపీడీఓ మాధురి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

లింగాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన సరిపూడి శివయ్య, చెకుకూరి కోటయ్య, నాయుడు వీరాంజనేయులు ఎమ్మెల్యే శంకరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్యకర్తలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు



ఎమ్మెల్యే శంకరరావుతో పార్టీలో చేరిన టీడీపీ నాయికులు, కార్యకర్తలు

అమరావతి: వైకుంఠపురం గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గుంటూరులోని తన కార్యాలయంలో టీడీపీ నాయకులు జూపల్లి బాలశౌరి, కర్రి కోటేశ్వరరావు, కుమ్మరి అనీల్ కుమార్, మాగులూరి జనార్ధనరావు, కాశిమాల బుజ్జిబాబు, కుమ్మరి చిన్నపాములు, కుమ్మరి పాపయ్య, కుమ్మరి అశోక్, కర్రి జయరాజ్, గంగోలు చిన్న, పీర్‌సా, కాశిమాల శివ, కాశిమాల రాయప్ప, కాశిమాల చెంచు, కాశిమాల మస్తాన్, గంగోలు రాఘవయ్య, బిట్టు మధుబాబు, కాశిమాల పెద చెంచు, కుమ్మరి కోటేశ్వరరావు, గంగోలు దాసు, బిట్టు బుజ్జి, కర్రి ప్రకాశరావు, గంగోలు అంకారావు, కాశిమాల థామస్, గంగోలు ప్రకాశమ్మ, గంగోలు సురేష్, కాశి మాల నాగమ్మ, బొట్టు తంబి, గంగోలు బాబు, మాగులూరి ప్రకాశరావు తదితరులతో పాటు సుమారు 40 కుటుంబాల వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నంబూరు శంకరరావు మాట్లాడుతూ సీఎం జగనన్నకు, వెఎస్సార్ సీపీకి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు గుబ్బా వెంకటేశ్వరరావు, నండూరి రామారావు, కుమ్మరి మిఖైల్ పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం స్ఫూర్తిదాయకం

పెదకూరపాడు: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం స్ఫూర్తిదాయకమని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనాన్ని వివరించారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'



స్టిక్కర్ అంటిస్తున్న మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుభాని

పెదకూరపాడు: పెదకూరపాడు గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. క్రోసూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ సుభాని, వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు కారు బాబు ఆధ్వర్యంలో గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విధి, విధానాలను వివరించారు. ఇంటి పెద్ద మద్దతుతో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అంటించారు.

రూ.60వేలు ఆర్థిక సాయం



మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ, సిబ్బంది

రాజుపాలెం: మండల విద్యావనరుల కేంద్రంలో సీఆర్పీగా పనిచేస్తున్న కడదరపు మల్లికార్జునరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. సోమవారం కార్యాలయం సిబ్బంది, ఎంఈఓ మల్లికార్జునశర్మ రూ.20 వేల నగదును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. రాజుపాలెం జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు రూ.19వేలు, మొక్కపాడులోని పాఠశాలల ఉపాధ్యాయులు రూ.11వేలు, చౌటపాపాయపాలెం పాఠశాలల ఉపాధ్యాయులు రూ.10వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. ప్రభుత్వం తరుపున వచ్చే సహాయాన్ని త్వరలో అందిస్తామని ఎంఈఓ తెలిపారు.